క్లుప్తంగా

ఆలయాలకు నిధులు కేటాయించాలి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొండగట్టు: అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం మాట్లాడారు. చొప్పదండి నియోజకవర్గంలోని కొండగట్టు అంజన్న ఆలయం, కొడిమ్యాల మండలంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏళ్లుగా ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయాయన్నారు. మొదటిసారి సమావేశాల్లోనే ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి గురించి అసెంబ్లీలో మాట్లాడిన తీరుపై అంజన్న భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం

కథలాపూర్: మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎంజల కీర్తన, చింత శరణ్య అనే విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీల్లో ప్రతిభ చాటారని ఉపాధ్యాయులు తెలిపారు. భువనగిరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టులో ఇద్దరికి అవకాశం దక్కిందన్నారు. ఈ పోటీల్లో కరీంనగర్ జట్టు ప్రథమ బహుమతి సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను శుక్రవారం హెచ్ఎం కిషన్‌రావు, పీఈటీ వాసాల రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి



డీఎస్పీని అభినందిస్తున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి: శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు కోరారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శుక్రవారం బీజేపీ నాయకులతో పాటు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఇల్లెందుల కృష్ణమాచారి, కొండ్లెపు శ్రీనివాస్, పిన్నంశెట్టి గంగాధర్, అంబల్ల జగన్, ఓంకారి అంజయ్య తదితరులున్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



మాట్లాడుతున్న వైద్యాధికారులు

మేడిపల్లి: వచ్చే పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు. విద్యార్థులు పోషకాహార లోపం అధిగమించడానికి, మానసిన ఒత్తిడికి గురికాకుండా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, మండల వైద్యాధికారి ప్రవీణ్‌చంద్ర, ఉపాధ్యాయులు, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ట్రస్మా అధ్యక్షుడు శ్రీధర్‌రావు అన్నారు. శుక్రవారం జ్యోతి హైస్కూల్ విద్యార్థులకు గీత విద్యాలయం స్టేడియంలో స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు, మానసిక శారీరక ఉల్లాసం కోసం క్రీడల్లో సైతం పాల్గొనాలని పేర్కొన్నారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు. డైరెక్టర్లు హరిచరణ్‌రావు, రజితరావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫలితమివ్వని మంకీ ఫుడ్ కోర్టులు

- ఉపాధిహామీలో ఏర్పాటు
- గ్రామ పంచాయతీలకు అప్పగింత
- నిర్వహణ లోపంతో దెబ్బతిన్న లక్ష్యం



మంకీ ఫుడ్‌కోర్టుకు కేటాయించిన నిధుల వివరాలు



రేచపల్లి శివారులో ఏర్పాటు చేసిన మంకీ ఫుడ్‌కోర్టు

సారంగాపూర్: అడవుల్లో ఉండాల్సిన కోతులు గ్రామాలకు చేరి ప్రజలను నానా హంగామా చేస్తున్నాయి. కోతులను తిరిగి అడవుల్లోకి పంపించాలని ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2019–20 సంవత్సరంలో సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో మంకీఫుడ్ కోర్టులను ఏర్పాటు చేసింది. దీని కోసం ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద రూ. 5.52 లక్షలు ఖర్చు చేసింది.

అటవీశాఖ భూములు కేటాయింపు

సారంగాపూర్ మండలంలో సారంగాపూర్, రేచపల్లి, బీర్‌పూర్ మండలం కొల్వాయి అటవీప్రాంతం, రెవెన్యూ భూముల్లో మంకీఫుడ్ కోర్టులను ఏర్పాటు చేసింది. ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేస్తున్న ఫుడ్ కోర్టులకు రెవెన్యూ భూములు లేని చోట అటవీశాఖ 5 ఎకరాల భూమిని ఆయా గ్రామాలకు కేటాయించింది. ఈ మూడు గ్రామాల్లో మంకీఫుడ్ కోర్టులను ప్రతి గ్రామంలో 5 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. మంకీ ఫుడ్ కోర్టులో అటవీజాతులకు చెందిన పండ్లను అందించే 2 వేల మొక్కలు ఏర్పాటు చేశారు. ఇందులో వెలగ, జువ్వి, రావి, జామ, అలనేరేడు, తునికి, మర్రి, సీమచింత, సీతాఫలం మొక్కలను నాటారు. మంకీ ఫుడ్ కోర్టుల చుట్టూ వెదురు కంచెలను ఏర్పాటు చేశారు. మొక్కలకు గుంతలు తీసి, కుండీలను నిర్మించి నీటిని అందించారు.

నిర్వాహణ తీరు..

రెండేళ్ల పాటు ఉపాధిహామీ శాఖ ద్వారా వీటి నిర్వాహణ జరిగింది. మొక్కలకు నీరు పోసి, గుంతలు తీయడానికి ప్రతి రోజుకు ఒక్క మొక్కకు ఉపాధి హామీ శాఖ కూలీకి రూ. 5 ఖర్చు చేసింది. రెండేళ్ల వరకు నిర్వాహణ బాగానే సాగింది. తరువాత వీటి నిర్వాహణ ఆయా గ్రామపంచాయతీలకుఅప్పగించారు...

దక్కని మొక్కలు

ఆయా గ్రామపంచాయతీలు రెండేళ్ల పాటు గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి మొక్కలను పెంచారు. ఏడాది కాలంగా వీటి గ్రామపంచాయతీల్లో నిధుల కొరతతో మంకీ ఫుడ్ కోర్టుల్లో మొక్కలు ఎండిపోయాయి. ప్రస్తుతం ప్రతి మంకీ ఫుడ్ కోర్టులో నాటిన 2 వేల మొక్కల్లో తక్కువ మొక్కలు బతికాయి.

తీరని ప్రజల ఇబ్బందులు

గ్రామాల్లో కోతులు చేరి ప్రజలకు నానా అవస్థలకు గురిచేస్తున్నాయి. మంకీ ఫుడ్ కోర్టుల్లో మొక్కల ఎదుగుదల బాగుంటే గ్రామాలకు చేరే కోతులను కొంత వరకైనా నివారించవస్తుండేదని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

కోతులతో అవస్థలు పడుతున్నాం



గ్రామాల్లో కోతులతో నానా అవస్థలు పడుతున్నాం. ప్రతీ ఇంట్లో చేరి నానా హంగామా సృష్టిస్తున్నాయి. మంకీ ఫుడ్ కోర్టులు సక్సెస్ అయితే కోతులు వాపస్ పోతుండేవి. కానీ అవి సక్సెస్ కాలేదు. ఫుడ్‌కోర్టులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

–చేకుట శేఖర్, సారంగాపూర్

గ్రామపంచాయతీలకు అప్పగించాం



గ్రామపంచాయతీలకు ఫుడ్‌కోర్టులు అప్పగించాం. వీటిని నిర్వహించాల్సిన బాధ్యత గ్రామపంచాయతీలదే. ప్రభుత్వం మంకీఫుడ్ కోర్టులపై ఏదైనా ఆదేశాలు జారీ చేస్తే తిరిగివీటిని పునరుద్ధరించే చర్యలు తీసుకుంటాం.

– గంగాధర్, ఏపీవో, సారంగాపూర్.

కేసీఆర్ హయాంలో భూములు సస్యశ్యామలం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కెనాల్ వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో డీ–52 కెనాల్‌కు తూము నిర్మించి నీరందించి వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం చేశామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మేడిపల్లి మండలం తొంబర్‌రావుపేట గ్రామంలోని డీ–52 తూమును రాయికల్ మున్సిపల్‌చైర్మన్ మోర హన్మండ్లు, మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. రాయికల్ మండలంలోని భూములకు డీ–52 కెనాల్‌తో వేలాది ఎకరాలు సస్యశ్యామలం అయ్యాయని తెలిపారు.ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా ప్రతి గ్రామాలకు సాగునీటి సరఫరా అవుతుందన్నారు. దీంతో భూగర్భజలాలు అంతరించి పోకుండా ఉంటున్నాయన్నారు. రాయికల్ మండలంలో నీటి కొరత రాకుండా చూడాలని ఎస్సారెస్పీ అధికారులను కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, సంతోష్‌రెడ్డి, భూమారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీవో

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఈసీ మనోజ్, టీఏ దయాకర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

జగిత్యాలరూరల్: ఈనెల 17న మండలంలోని కండ్లపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు హాజరుకావాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు శుక్రవారం అంబేద్కర్ సంఘం నాయకులు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత, కౌన్సిలర్ కూతురు రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

రాయికల్: తెలంగాణ జయభేరి పుస్తకాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మైతాపూర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుస్తకాన్ని రచించిన ద్యావరశెట్టి జనార్ధన్, గంప ఆనందంను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కౌన్సిలర్ శ్రీధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, మోతుక్కూరి చిన్న కిష్టయ్య, గంగాధర్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాల రక్షణకు కృషి చేయాలి



నియామక పత్రాలు అందిస్తున్న వివిధ సంస్థలు

కోరుట్లరూరల్: ఉద్యోగాల్లో నియమితులైన వెటర్నరీ విద్యార్థులు సమాజ శ్రేయస్సు, మూగ జీవాల రక్షణకు కృషి చేయాలని కోరుట్ల పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ తక్కళ్లపల్లి మాధవ రావు అన్నారు. కళాశాలలో ఈఎంఆర్‌టీ గ్రీన్ హెల్త్, జీవీకే సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 30 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి, ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో తమ ఉద్యోగాల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అశోక్ కుమార్, రంగారావు, సత్యప్రసాద్, తుషార్, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ రాధాకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో రక్తదాన శిబిరం

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని నాచుపెల్లి జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ విద్యార్థి టి.సూర్యతేజ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా, విద్యార్థి జ్ఞాపకార్థం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ వారు శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కామాక్షి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.వేణుగోపాల్, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబీసీ పీపుల్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాజేందర్

మల్లాపూర్: ఆల్ ఇండియా ఓబీసీ పీపుల్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా మల్లాపూర్ మండలం పాత దామరాజుపల్లికి డా. సుతారి రాజేందర్ నియమితులయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన బీసీ ల రాజకీయ శిక్షణ తరగతుల్లో జాతీయ అధ్యక్షులు చామకూర రాజు రాజేందర్‌కు నియామక పత్రం అందించారు. ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేవీ గౌడ్ మాట్లాడుతూ చట్టసభల్లో వాటా కోసం జిల్లాలో భారీ బహిరంగ నిర్వహిస్తామని తెలిపారు.

సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావన

కోరుట్ల: నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం అసెంబ్లీ జీరో అవర్‌లో ప్రస్తావించారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు హయాంలో గృహజ్యోతి పథకంలో భాగంగా సొంత జాగా ఉన్నవారికి ఇళ్లు మంజూరు చేశారని, సొంత స్థలం కూడా లేని వెయ్యి మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వల్ల పంపిణీ చేయలేదని, వాటిని పంపిణీ చేయాలని కోరారు. పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

వైద్యుడిపై దాడి.. నలుగురిపై కేసు

మెట్‌పల్లి: పట్టణంలోని గాయిత్రి ఆసుపత్రిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆసుపత్రిలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడమే కాకుండా వైద్యుడు సాగర్‌పై దాడి చేశారనే ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కులగణన బిల్లు ప్రవేశపెట్టడం సంతోషకరం

కథలాపూర్: అసెంబ్లీలో శుక్రవారం కులగణన బిల్లు ప్రవేశపెట్టడం సంతోషకరమని మున్నూరుకాపు సంఘం కథలాపూర్ మండలాధ్యక్షుడు చెదలు సత్యనారాయణ అన్నారు. దీనికోసం కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందనడానికి నిదర్శనం ఈ బిల్లు ప్రవేశపెట్టడమని ఆయన పేర్కొన్నారు.

దాడులు నిరసిస్తూ ప్రైవేట్ ఆస్పత్రుల బంద్

మెట్‌పల్లి: పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రైవేట్ ఆస్పత్రుల బంద్ నిర్వహించారు. డాక్టర్లపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రులను మూసి వైద్యులు నిరసన తెలిపారు. దాడులకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన యువకులకు సన్మానం

పెగడపల్లి: మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన పుట్ట శ్రావణ్, అయితరవేని మహేందర్ అనే యువకులు ఇటీవల పోలీస్ ఉద్యోగాలు సాధించి నియామక పత్రాలు అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో స్థానిక ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన శ్రావణ్, మహేందర్ పట్టుదలతో చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సింగసాని విజయలక్ష్మి, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి గాను మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్‌లోని మైనార్టీ మహిళల నుంచి ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమాధికారి సాయిబాబా తెలిపారు. స్టార్ మహిళ ట్రైనింగ్ సెంటర్ ద్వారా శిక్షణ ఇవ్వబడునని పేర్కొన్నారు. శిక్షణ 45 రోజులు ఉంటుందని, ఆసక్తి గలవారు ఈనెల 22లోగా ఆధార్‌కార్డు, పాస్‌ఫొటో, రేషన్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లు జతపరుస్తూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు కలెక్టర్ కార్యాలయం, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ కార్యాలయం, కోరుట్లలోని స్టార్ మహిళ ట్రైనింగ్ సెంటర్‌లో లభ్యమవుతాయని సాయిబాబా తెలిపారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి మల్లేశం కోరారు. కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం తమ సమస్యలపై కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రతతో పాటు, తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, పంచాయతీ వర్కర్స్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

రాయికల్: మహాలక్ష్మి ఉచిత ప్రయాణంతో ఆటో కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని యూనియన్ అధ్యక్షుడు సామల్ల ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఒకరోజు బంద్‌కు పిలుపునిచ్చారు. ప్రభుత్వం జీవనభృతి కింద రూ.15 వేలు కల్పించాలని, మృతిచెందిన ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, మృతిచెందిన ఆటో డ్రైవర్ కుటుంబాలను ఆదుకుని రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోసిన్, గంగారెడ్డి, జలీల్, బొప్పారపు రాజం, ముస్తాక్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఒకరోజు బంద్

జగిత్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని ఆరోపిస్తూ శుక్రవారం ఆటో డ్రైవర్లు ఒక రోజు బంద్ పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్ ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని ప్రభుత్వ నిర్ణయంతో తమ ఉపాధికి తీవ్ర విఘాతం ఏర్పడిందని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆటోలపై తీసుకున్న రుణాలను మాఫీ చేసి, ప్రతినెలా రూ.15 వేల జీవనభృతి అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో,జీపు, టాటా మ్యాజిక్ డ్రైవర్లు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు యూఎస్‌పీసీ మద్దతు



పెగడపల్లిలో దుకాణం బంద్ చేయిస్తున్న కార్మికులు

జగిత్యాల: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా చేస్తున్న సార్వత్రిక సమ్మెకు మద్దతిస్తున్నట్లు యూఎస్‌పీసీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికులు, రైతులు సాధారణ ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌సుందర్, రాంరెడ్డి, భూమేశ్వర్, రాంచంద్రం, శ్రీనివాస్, ఆగమయ్య, జయంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

పెగడపల్లి: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన బంద్ పెగడపల్లిలో విజయవంతమైంది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ నాయకత్వాన కార్మికులు దుకాణాలు, వ్యాపార వాణిజ్య సంస్థలను మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో పని చే స్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనం కింద రూ. 26 వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో, భవన కార్మిక సంఘాల నాయకులు శంకర్, సురేశ్, గఫూర్, చందు, లచ్చయ్య, రమేశ్, రామ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎంను కలిసిన గ్రంథాలయ మాజీ చైర్మన్

గొల్లపల్లి: జగిత్యాల జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు తన కూతురు వివాహానికి రావాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి వివాహ పత్రిక అందజేశారు.అలాగే మంత్రి శ్రీధర్ బాబుకు కూడ వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు.వారి వెంట కాంగ్రెస్ నాయకులు కిష్టంపేట రమేష్ రెడ్డి ఉన్నారు.

ఎస్సై, ఎంపీడీవోలకు సన్మానం

మల్లాపూర్: మండల ఎస్సై కిరణ్‌కుమార్, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సందర్భంగా శుక్రవారం మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యం రఘు, కాంగ్రెస్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫీషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, అధికార ప్రతినిధి బోయిని హన్మాండ్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవోబాధ్యతలు స్వీకరణ

కథలాపూర్: మండల ఎంపీడీవోగా మాలోత్ శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో జనార్ధన్ సిద్దిపేట జిల్లాకు బదిలీ కాగా, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి ఎంపీడీవోగా పనిచేసిన శంకర్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్‌ను ఎంపీపీ రేవతి శాలువాతో సన్మానించారు. అనంతరం మండల పరిషత్ అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది ఎంపీడీవోను పరిచయం చేసుకున్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి విగ్రహ ఆవిష్కరణ

గొల్లపల్లి: మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బుర్ర లక్ష్మీరాజం గౌడ్ విగ్రహం కుటుంబ సభ్యులు,గ్రామస్తులు శుక్రవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచాడని గ్రామానికి,పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు,గ్రామ పెద్దలు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ కులగణన బిల్లు హర్షణీయం

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ కులగణన బిల్లు ప్రవేశ పెట్టడం హర్షణీయమని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ గౌడ్, మున్నూరు కాపు రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ వేరు, వేరు ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. బీసీ బిల్లు ద్వారా రాష్ట్రంలో బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు అవగాహన

వెల్గటూర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో పది, ఇంటర్ చదువుతున్న విదాయర్థులకు పరీక్షల నేపథ్యంలో ఒత్తిడి నియంత్రణపై అవగాహన కల్పించినట్లు డా.శ్రవణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ధర్మపురి: నిరుపేద యువకుడి వైద్య ఖర్చుల కోసం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవతో శుక్రవారం రూ.2.30 లక్షల విలువ గల ఎల్‌వోసీని ఆస్పత్రి వైద్యులకు అందజేశారు. ధర్మపురికి చెందిన ఇనగుర్తి హరీశ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్‌లో అడ్మిట్ అయ్యాడు. ఆర్థికంగా ఇబ్బందులతో ఆస్పత్రిలో వైద్యం అందించడం లేదని హరీశ్ తల్లిదండ్రులు విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి ఆస్పత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి తన పీఏ ద్వారా రూ 2.30 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. ఈసందర్భంగా విప్ లక్ష్మణ్‌కుమార్‌కు బాధితుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చిడతల రామాయణ నాటక ప్రదర్శన

వెల్గటూర్: ఎండపల్లి మండలం కొత్తపేటలో చిడతల రామాయణ నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. అంతరించి పోతున్న పౌరాణిక కళకు కొత్తపేట గ్రామస్తులు ప్రాణం పోస్తున్నారు. మూడురోజుల పాటు కొనసాగనున్న నాటక ప్రదర్శనలో మొదటి రోజు శ్రీ సీతారాముల కల్యాణం, వాలి వధ తదితర ఘట్టాలు ప్రదర్శించగా, రెండో రోజు సీతారాముల వనవాసం, భరతునికి పట్టాభిషేకం, మూడవ రోజు రావణాసుర వధ, సీతారాముల పట్టాభిషేకం తదితర ఘట్టాలు ప్రదర్శించనున్నారు. నాటకాన్ని కొత్తపేటతో పాటు ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు వీక్షించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వెల్గటూర్: మండలంలోని కిషన్‌రావుపేటలో సీసీరోడ్డు, యాదవ సంఘ భవనానికి పంచాయతీ ప్రత్యేకాధికారి గంగాధర్ శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, సంఘ భవనానికి రూ.5 లక్షల రూపాయల ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మాణాలు చేయనున్నట్లు ప్రత్యేకాధికారి తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా రథ సప్తమి వేడుకలు

కోరుట్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తిరుపతి దేవస్థానం హిందూ దర్మ ప్రచారక్ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ కస్తూరి రాజన్న విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచారక్ పరిషత్ జిల్లా కన్వీనర్ జగన్, హెచ్ఎం భూపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ శ్రీసూర్య భగవానుడి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపై ఉన్న స్వామివారి మూల విరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

జగిత్యాలటౌన్: రథసప్తమి సందర్భంగా పట్టణంలోని చింతకుంట చెరువు సమీపంలోని శ్రీసూర్య నారాయణ ,ధనలక్ష్మిసహిత శ్రీధన్వంతరి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రాధిక, ఆలయ ఫౌండర్ డా రాజన్న, ధనుంజయ్,శంకర్, రాజేందర్, రాంచంద్రం, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

జగిత్యాల జిల్లా: 9951602934, 9000308905

Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

రమేష్, ACO - 7997958214
జగిత్యాల: రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి: వెంకటేష్ - 8008019205
కోరుట్ల: సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899